సిద్దిపేట

నమస్తే తెలంగాణ

గురువారం 24 ఏప్రిల్ 2025
THURSDAY, APRIL 24, 2025

# కోనసీమ వంటిల్లు హోటల్ ప్రారంభం



సిద్దిపేటలో కోనసీమ వంటిల్లు హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 23: పట్టణ వాసులకు రుచికరమైన భోజనం అందించాలనే లక్ష్యంతో పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో కోనసీమ వంటిల్లు హోటల్ ఏర్పాటు చేయడం సంతోషకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలోని కోనసీమ వంటిల్లు హోటల్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సుతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు ,వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు,నాయకులు కొండం సంపత్‌రెడ్డి,మచ్చ వేణుగోపాల్‌రెడ్డి,గుండు భూపేశ్,పట్టణ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు ,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శివాలితండాలోని సమస్యలు పరిష్కరించాలి



జనగామ ఎమ్మెల్యే పల్లాను కలిసిన శివాలితండాకు చెందిన నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: ధూళిమిట్ట మండలం శివాలితండాలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీఆర్ఎస్ గిరిజన నాయకుడు లకావత్ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తండాలో సీసీ రోడ్లు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. తండాలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించాలన్నారు. 18 నెలల క్రితం ప్రారంభించిన కొండాపూర్ టూ రామవరం బీటీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలన్నారు. తండాలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు తండా అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో లకావత్ రాజునాయక్ ఉన్నారు.

# డాక్యుమెంట్ రైటర్స్ ఆధ్వర్యంలో 'వంటావార్పు'



చేర్యాలలో వంటావార్పు చేపట్టిన డాక్యుమెంట్ రైటర్స్

చేర్యాల, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని కోరుతూ చేర్యాల డాక్యుమెంట్ రైటర్స్ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాల రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్స్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదాయం కోసం ఎల్ఆర్ఎస్ లాంటి ఏవేవో స్కీంలు పెట్టిందన్నారు. ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వానికి సరిగ్గా అవగాహన లేకపోవడం వల్ల రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. స్లాట్ బుకింగ్ వల్ల ప్రభుత్వానికి కొత్తగా వచ్చే ఆదాయం ఏమీలేదన్నారు. స్లాట్ బుకింగ్ ప్రక్రియ వల్ల రిజిస్ట్రేషన్లలో జాప్యం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డాక్యుమెంట్ రైటర్స్ చేపట్టిన నిరసన కార్యక్రమానికి చేర్యాల జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్యపంతులు మద్దతు తెలిపారు.

# ఎంసీహెచ్‌లో అందుబాటులోకి వైద్యసేవలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

గజ్వేల్, ఏప్రిల్ 23: నూతనంగా నిర్మించిన గజ్వేల్‌లోని జిల్లా దవాఖానలో నేటి నుంచి అన్ని రకాల సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ అన్నపూర్ణ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో కొద్ది రోజులుగా ఓపీ సేవలు మాత్రమే చూసే వారని, నేటి నుంచి అన్ని రకాల సర్జరీలు, డెలివరీలను అందు లోనే చేస్తామన్నారు. దవాఖానలో అందుతు న్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక నుంచి మాతాశిశులో గర్భిణులకు రోజూ ఓపీ సేవలు చూడడంతో పాటు అత్యవసర సమయంలో సర్జరీలు చేస్తామన్నారు. వైద్యులు జయశ్రీ, రాము, సాయికిరణ్, జ్యోతి, త్రివే ణి, మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

# పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



గ్రంథాలయంలో పుస్తకాలతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గజ్వేల్, ఏప్రిల్ 23: విద్యార్థులు రోజూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ అన్నారు. బుధవారం ప్రపంచ పుస్తక, కాపీరైట్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పుస్తక పఠనంతో విద్యార్థుల్లో పరిపూర్ణ వ్యక్తిత్వం పెంపొందుతుందని, నేటి ఆధునిక కాలంలో యువత సెల్‌ఫోన్, ఇంటర్నెట్, టీవీ, సినిమాలకు బానిసై పెడదోవపడుతున్నారన్నారు. పుస్తకం మంచి నేస్తమని, పుస్తకాలను చదవడం వల్ల ఎన్నో గొప్ప విషయాలు తెలుసుకోవచ్చన్నారు. జ్ఞానాన్ని సంపాదించడమే కాకుండా మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. గ్రంథపాలకుడు వెంకటేశ్వర్లు, రచయిత డాక్టర్ రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, గణపతిరావు పాల్గొన్నారు.

# వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై కిషన్

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 23 : పని చేసే చోట మానసికంగా వేధించినా..అవమానించినా ఏమాత్రం భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిద్దిపేట షీటీమ్ ఏఎస్సై కిషన్ సూచించారు.షీటీమ్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం దేశాయి బీడీ కంపెనీ మహిళా కార్మికులకు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళల భద్రత మా బాధ్యత అని, ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉంటామన్నారు.చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, మహిళల రక్షణకు నూతన చట్టాలు అందుబాటులోకి వచ్చాయన్నారు.కార్యక్రమంలో షీటీమ్ పోలీసులు మమత ,లక్ష్మీనారాయణ ,ప్రవీణ్,బీడీ కంపెనీ మేనేజర్ దీపక్ పాటిల్ ,బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**తెలంగాణ రైతు సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రావిపల్లి శ్రీరాంరెడ్డి**

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 23 : వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రావిపల్లి శ్రీరాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘాల సమాఖ్య జిల్లా సమావేశం బుధవారం సిద్దిపేటలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడగండ్ల వానతో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు.ముఖ్యంగా వరి,మామిడి, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షలు రుణమాఫీ కాని రైతులందరికీ మాఫీ చేయాలని..రైతు భరోసా ఇవ్వాలన్నారు .కార్యక్రమంలో రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడీల బైరవరెడ్డి, రాష్ట్ర సలహాదారు పులి రంగారెడ్డి ,సంఘం నేతలు ఈశ్వర్‌రెడ్డి,వెంకట్‌రెడ్డి, రామచంద్రరెడ్డి ,గాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘాల సమాఖ్య నేతలు

# మురుగు..పరుగు

- గజ్వేల్‌లో రోడ్లపై పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పలు కాలనీల ప్రజలు



గజ్వేల్ పట్టణంలోని 16వార్డులో ఇండ్ల మధ్య మురుగునీటి గుంత



ముట్రాజ్‌పల్లి మార్గంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

గజ్వేల్, ఏప్రిల్ 23: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని మురుగురహితంగా మార్చడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ)పైప్‌లైన్ పనులు చేపట్టారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పనుల్లో నాణ్యత పాటించలేదనే విమ ర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలోనే మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో రూ.155కోట్లతో 138కిలోమీటర్ల మేర భూగర్భ మురుగు నీటి పైప్‌లైన్ (యూజీడీ), నాలుగు చోట్ల ఎస్‌టీపీ (సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాం ట్) నిర్మాణం కోసం పనులు చేపట్టారు. యూజీడీ ద్వారా పట్టణంలో సుమారు 9,500పైచిలుకు ఇండ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా వంద శాతం ఇం డ్లకు ఇవ్వలేదు. వందల సంఖ్యలో ఇండ్లకు యూజీడీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండడంతో మున్సిపల్ కార్యాలయం చుట్టూ పట్టణ వాసులు తిరుగుతున్నారు.

**రోడ్డుపై పారుతున్న మురుగు**

మహతి ఆడిటోరియం సమీపంలో ముట్రాజ్‌పల్లి రోడ్డుపై చాంబర్లగుండా మురుగు పైకి వచ్చి రోడ్డుపై పారుతున్నది. ఇదే మార్గంలో ముట్రాజ్‌పల్లి, ఆర్అండ్ఆర్ కాలనీవాసులు, ఉదయం మార్నింగ్ వాకర్స్ వెళ్తుంటారు. ఐవోసీ, మున్సిపల్ కార్యాలయాల అధికారులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై దుర్గంధం వెదజల్లుతుండడంతో అధికారులు, పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మురుగు అధికంగా చేరడంతో ద్విచక్ర వాహనదారులకు సైతం ఇక్కట్లు తప్పడం లేదు. మహతి ఆడిటోరియం వెనుకాల కూడా ఇదే సమస్య ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. పట్టణంలోని 16వ వార్డులో ఇండ్ల మధ్యనే మురుగు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు.

**యూజీడీ సమస్యపై చర్యలు తీసుకుంటాం**

యూజీడీ సమస్య చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటాం. పట్టణవాసులు మురుగు నీటి పైప్‌లైన్‌లో ప్యాడ్లు, ఇతర వ్యర్థాలు వేయవద్దు. చాలా వరకు అలాంటి వాటితోనే సమస్య తలెత్తుతున్నది. మురుగుపైకి వస్తున్నచోట వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరిస్తాం.
– గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, గజ్వేల్



ముట్రాజ్‌పల్లి మార్గంలో చాంబర్ నుంచి పైకి వస్తున్న మురుగునీరు

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య**



నంగునూరు: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, ఏప్రిల్ 23 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని పాలమాకులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఎన్నో హామీలు ఇచ్చి.. వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎల్కతుర్తి రజతోత్సవ సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. మాజీ సర్పంచ్‌లు ఎల్లంకి రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివశంకర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకట్, నాయకులు ఐలయ్య, ఓజాల్, రవి, లక్ష్మణ్, నరేశ్, కనకయ్య, మల్లేశం, వేణు, రాములు, రమేశ్, రాకేశ్, సంపత్ పాల్గొన్నారు.

**సభా స్థలిని సందర్శించిన బీఆర్ఎస్ చేర్యాల నాయకులు**



చేర్యాల: ఎల్కతుర్తి సభా స్థలి వద్ద జై తెలంగాణ నినాదాలు చేస్తున్న చేర్యాల బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 23 : వరంగల్ పట్టణంలోని ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహంచే రజతోత్సవ భారీ బహిరంగసభా స్థలిని బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ చేర్యాల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్కతుర్తి సభాస్థలిని చూస్తుంటే నాటి ఉద్యమం గుర్తుకొస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగంపై ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, చేర్యాల మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, చేర్యాల టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సిద్ధిరాములు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో మాట్లాడుతున్న ఏర్పుల మహేశ్

**కొమురవెల్లిలో...**

కొమురవెల్లి, ఏప్రిల్ 23 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆపార్టీ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేశ్ కోరారు. బుధవారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ యూత్, విద్యార్థి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 నెలల కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపంగా మారిందన్నారు. అమలుకాని హామీలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు పర్చడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. గులాబీ అధినేత కేసీఆర్ ప్రసంగం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు కొండ శ్రీధర్, గౌటె రవి, గజ్జె వెంకటేశ్, ముక్కు విరాట్‌బాబు, మహేందర్‌యాదవ్, లింగంపల్లి అజయ్ కుమార్, మ్యాకల రాకేశ్ పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్

బెజ్జంకి, ఏప్రిల్ 23: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం భూభారతిపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు చెందిన వ్యవసాయ భూమికి భూధార్ కార్డు, వ్యవసాయ భూములకు సైతం మ్యాప్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, సింగిల్‌విడో చైర్మన్ శరత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మే 1 నుంచి హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణా శిబిరం



చేర్యాల: వేసవి శిక్షణా శిబిరం వివరాలు వెల్లడిస్తున్న దామెర మల్లేశం

చేర్యాల, ఏప్రిల్23: మండలంలోని ముస్త్యాల మోడల్ స్కూల్‌లో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర మల్లేశం తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ భిక్షం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దూరులో హ్యాండ్‌బాల్ ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.15 ఏండ్లలోపు పిల్లలకు హ్యాండ్‌బాల్ క్రీడలో మెళకువలు నేర్పేందుకు శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పూర్తి వివరాలకు సెల్: 8520846153,9989697473 నెంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అంబాల రాముగౌడ్, పీడీ బూర్గు బాల్‌రాజ్‌గౌడ్, పీడీలు అజహర్, స్వాతి, బాస్కర్, పీఈటీ నాగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరాలు**

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాల, గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ అధికారి మౌఖిక ఆదేశాల మేరకు గురువారం నుంచి మే 4వ తేదీ వరకు విద్యార్థుల కోసం వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసినట్లు మద్దూరు మండల ఎంఈవో వరదరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా శిబిరాల్లో విద్యార్థులకు అందమైన చేతిరాత, చిత్రలేఖనం, రంగవల్లి, డ్యాన్స్, పాటలు, మంచి అలవాట్లు, దేశభక్తి, నైతిక విలువలు, ఎన్‌సీసీ, కరాటే, కనీస గణిత సామర్థ్యాలు, స్పోకెన్ ఇంగ్లిష్, కవిత్వం, పద్య,గద్య రచనలు, యోగా, జీవన నైపుణ్యాలు తదితర అంశాలపై విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియో గం చేసుకోవాలని ఆయన కోరారు.

# పాల శీతలీకరణ కేంద్రం పరిశీలన



పాల శీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృషి కల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీఎం పాటిల్

ములుగు, ఏప్రిల్ 23 : మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య పాల శీతలీకరణ కేంద్రాన్ని బెంగళూరుకు చెందిన కృషి కల్ప ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీఎం పాటిల్ డీఆర్డీవో జయదేవ్ ఆర్యాతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహణ తీరు, పాటిస్తున్న ప్రమాణాలు, పాల సేకరణ, శీతలీకరణ, మిల్క్ బిల్లింగ్, పాడి రైతులకు విజయ డెయిరీ, మండల సమాఖ్య అందిస్తున్న సేవలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎం వాసుదేవ్, ఏపీఎం యాదగిరి, సీసీలు రాజలింగం, భాస్కర్, నర్సింహులు, ఉమ పాల్గొన్నారు.

# శ్రీనివాస్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

నంగునూరు, ఏప్రిల్ 23 : మండలంలోని కొండంరాజ్‌పల్లికి చెందిన బండి శ్రీనివాస్ యాదవ్ ఆర్మీలో ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు బుధవారం పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు శ్రీనివాస్‌ను సన్మానించారు. దేశానికి సేవ చేయడంతో పాటు తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం




కొండపాక: సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక, ఏప్రిల్ 23 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సీఎంవో రంగనాథస్వామి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య**

రాయపోల్, ఏప్రిల్ 23 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని జిల్లా విద్యా శాఖఅధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవోతోపాటు మండల ప్రత్యేకాధికారి బాబునాయక్,ప్రముఖ వైద్యులు డాక్టర్ పెంటాచారి, ప్రజాయిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్‌రెడ్డి ,రవీందర్‌రెడ్డి, మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో వివిధ కారణాలతో మూతపడ్డ ప్రభుత్వ పాఠశాలలను మళ్లీ పునరుద్ధరిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్కారు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.రాష్ట్రంలో 'ఇస్రో యువ విజ్ఞాన వికాసం' అనే కార్యక్రమం చేపట్టడం జరిగిందని, అందులో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, మాజీ సర్పంచ్ కమ్మరి శ్రీనివాస్‌చారి,పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వీడ్కోలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం చివరి సంవత్సరం పూర్తి చేసుకొని వెళ్తున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి, అధ్యాపకులు కుమారస్వామి, అనిల్‌కుమార్, బాలరాజు, చంద్రమౌళి, విజయ, ఫాతిమా, నాయనాదేవి, సుధామాధురి, రాజ్యలక్ష్మి, పరశురామ్, శ్రీనివాస్, రమేశ్, మజీద్, రాజయ్య పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న పట్టణవాసులు

గజ్వేల్, ఏప్రిల్ 23: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా బుధవారం రాత్రి గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ నివాళులర్పించారు. ప్రజ్ఞాపూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణవాసులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అభినందనల వెల్లువ

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి చెందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కస్తూర్బావిద్యాలయంలో చదివిన విద్యార్థులు మంచి మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నగదు ప్రోత్సాహకాలు అందజేత**

మద్దూరు మండలం గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు 'శ్రీ సాయి శివశక్తి మోటివేషనల్ హెల్పింగ్‌హ్యాండ్స్' ఆధ్వర్యంలో మేక శ్రీనాథ్ రూ. 5వేల నగదు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం బైరగోని హరిప్రసాద్ తెలిపారు.

# నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 23: మండలంలోని పోతారం(ఎస్)లోని శుభంగార్డెన్‌లో గురువారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి ప్రభాకర్‌గౌడ్, కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్, ఆర్డీవోతోపాటు పలువురు అధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

**రేపు ధూళిమిట్ట, మద్దూరు మండల కేంద్రాల్లో..**

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: ధూళిమిట్ట, మద్దూరు మండల కేంద్రాల్లో శుక్రవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్లు సింహాచలం మధుసూదన్, అబ్దుల్‌గఫూర్ రహీం ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 9గంటలకు ధూళిమిట్ట రైతు వేదిక, మధ్యాహ్నం 12గంటలకు మద్దూరు తాజ్ మహల్ గార్డెన్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), హుస్నాబాద్ ఆర్డీవో ఆధ్వర్యంలో అవగాహన సదస్సుఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# పుస్తెమట్టెలు అందజేత



రాంసాగర్‌లో పేదింటి వధువుకు పుస్తెమట్టెలు అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

కొమురవెల్లి, ఏప్రిల్ 23 : మండలంలోని రాంసాగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన తాడూరి రేణుక-శ్రీను దంపతుల కుమార్తె మౌనిక వివాహం బుధవారం వారి స్వగృహంలో జరిగింది. ఈ పెండ్లికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి హాజరై వధువుకు పుస్తెమట్టెలు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు గజ్జె వెంకటేశ్ ఉన్నారు.

# ఆర్టీసీ బస్సుకు మరమ్మతు.. ఆగిన మంత్రి పొన్నం



ఆర్టీసీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గజ్వేల్, ఏప్రిల్ 23: గజ్వేల్ మండలం కొడకండ్ల రాజీవ్ రహదారిపై బుధవారం ఆర్టీసీ బస్సు రిపేర్‌తో రోడ్డుపై ఆగిపోయింది. అదే మార్గంలో హుస్నాబాద్ వెళ్తున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గమనించి కాన్వాయ్‌ని ఆపారు. ఆర్టీసీ బస్సు వద్దకు చేరుకొని డ్రైవర్, ప్రయాణికులతో మాట్లాడారు. ఆగిపోవడానికి కారణం తెలుసుకొని వెంటనే మరో బస్సు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకొని ముందుకు వెళ్లారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్23: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి కోరారు. బుధవారం మద్దూరులోని క్యాష్ కౌంటర్‌లో సీఈవో బోయిని శ్రీధర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మద్దూరు మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలన్నారు. దళారులకు ధాన్యాన్ని అమ్మి రైతులు మోసపోవద్దన్నారు. అకాల వర్షాల నుంచి ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వెనువెంటనే కాంటా వేసి మిల్లులకు తరలిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు 14 కేంద్రాల్లో 344మంది రైతుల నుంచి 16541 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.

# వేచరేణి అంగన్‌వాడీలో వార్షికోత్సవం



చేర్యాల, ఏప్రిల్23: మండలంలోని వేచరేణి అంగన్‌వాడీ కేంద్రంలో వార్షికోత్సవ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ ఐదేండ్లలోపు పిల్లలను గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను పంపకూడదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ మెటీరియల్ నేర్చుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.